

స్కేటింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

## విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్,అక్టోబర్1: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ విప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని ఓ ప్రైవేట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన 15వ ఇంటర్‌స్కూల్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ ఫాస్టెస్ట్ స్కేటర్, ఏసియన్ మెడలిస్ట్ నిఖిలేష్ తభానేతో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శంభీపూర్‌రాజు మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో ఇటువంటి పోటీలు జరగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ మాదాసు వెంకటేశం , తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్,అక్టోబర్1: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ,2వ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్‌తో కలిసి ఎన్‌ఆర్‌ఐ, ఆర్‌కే లే అవుట్, చందు లే అవుట్‌లకు చెందిన సంక్షేమ సంఘాలు, కాలనీవాసులు ఆదివారం బాచుపల్లి హిల్‌కౌంటీలోని వారి నివాసంలో మేయర్ దంపతులను కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కాలనీల్లోకి చేరిన వరదనీరు, బురదతో పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నాని, వీటిని పరిష్కరించేందుకు చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బలవన్మరణం



యువనాగదుర్గ(ఫైల్)

దుండిగల్,అక్టోబర్1: పెండ్లి చేసుకోవడం ఇష్టం లేని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం...కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాశ్‌నగర్‌కు చెందిన కరీంషెట్టి జానీ,సత్యవతి దంపతులకు జలదుర్గ వరప్రసాద్, యువనాగ దుర్గ(23) సంతానం. యువనాగదుర్గ ప్రస్తుతం ఎంబీఏ చదువుతుంది. ఇటీవల యువనాగదుర్గకు ఏడుకొండలు అనే యువకుడితో ఎంగేజ్‌మెంట్ అయ్యింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 29న తల్లిదండ్రులు ఊరికి వెళ్లగా వరప్రసాద్,యువనాగ దుర్గ మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో 30న రాత్రి 10 గంటల ప్రాంతంలో తనకు తినేందుకు బయటనుండి ఏదైనా ఆహారం తీసుకురావాలని సోదరుడికి చెప్పి బయటకు పంపింది.అతను ఆహారం తీసుకుని ఇంటికి వచ్చేసరికి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో వ్యక్తి..**

వివాహం కావడంలేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం...చింతల్ బోళాశంకర్‌నగర్‌లో వనం సతీష్(35) తన తల్లి పుష్పతో కలిసి నివాస ముంటున్నాడు. సతీష్ కూలీ పనులు చేస్తూ ఉపాధిని పొందుతున్నాడు. కాగా.. తల్లి పుష్ప రెండు రోజుల క్రితం విజయనగర్ కాలనీలో నివాసముంటున్న అన్న లింగం ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో సతీష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాలనీలను శుభ్రంగా ఉంచుకుందాం..

### 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్,అక్టోబర్1: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది చీపుర్లు చేపతపట్టి కాలనీలు, కార్యాలయాలను శుభ్రం చేశారు. ఇందులో భాగంగా గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంటసర్కిళ్ల పరిధిలో నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంట సర్కిళ్లను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపైనా ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకుందామని అన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. 'ఏక్ తారీక్‌కి ఏక్ గంట, ఏక్ సాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవ్యాస్ ఆనందం, తుర్కచెరువు, బండారీ లే అవుట్ కాలనీ వద్ద జరిగిన స్వచ్ఛత కార్యక్రమాల్లో మేయర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని స్థానికులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆమె తొలగించారు. మేయర్ మాట్లాడుతూ ..పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా భావించాలన్నారు. కార్పొరేటర్లు జ్యోతినర్సింహారెడ్డి, బొర్ర దేవిచందు, మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య నిర్వహణ అధికారి సుకృత, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.
- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ కార్యాలయం, పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణతో పాటు అధికారులు, సిబ్బంది చీపురు చేతపట్టి కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు.
- కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరి , సిబ్బంది పాల్గొన్నారు. శివాలయం రోడ్డు, సెంట్రల్ పార్కు పరిసరాలను శుభ్రపరిచారు.
- నగరశివారు,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,ప్రగతినగర్ సమీపంలోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం(ఇన్‌కాయిస్)లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్‌కు చెందిన శాస్త్రవేత్తలు, సిబ్బంది పలుపాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని శ్రమదానం చేశా రు. కార్యాలయం పరిసర ప్రాంతాలను శుభ్రం చేశా రు. సుమారు 500కిలోల వ్యర్థాలను సేకరించి, గ్రేటర్ మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.




సుభాశ్‌నగర్ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఆదివారం ముస్లింలు నిర్వహించిన మిలాదు ఉన్ నబీ వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే.. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని పలుచోట్ల మిలాదు నబీ వేడుకలు , సామూహిక ప్రార్థనలు జరిపారు. ఐడీపీఎల్ చౌరస్తా, గాంధీనగర్, ఆస్బెస్టాస్ ప్రాంతాల్లో శాంతిర్యాలీ నిర్వహించారు. సాబేర్, యూసఫ్, గఫార్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.
– జగద్గిరిగుట్ట,అక్టోబర్1

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దుండిగల్,అక్టోబర్1: వేలకోట్ల నిధుల వ్యయంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే వివేకానంద్ తన 120వ రోజు ప్రగతియాత్రను నిర్వహించారు. ఇందులో భాగంగా భాగ్యలక్ష్మికాలనీలో రూ.51.1లక్షలతో, భగత్‌సింగ్‌నగర్‌లో రూ.48.8లక్షలతో,అల్లూరి సీతారామరాజు నగర్‌లో రూ.31లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, ఫిష్ మార్కెట్ నిర్మాణ పనులు, సిద్ధార్థనగర్ మరాఠీ బస్తీలో రూ.35లక్షలతో, సూరారంకాలనీ రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని బ్లాక్ నంబర్ 95 నుంచి 45వరకు రూ.71.2లక్షల వ్యయంతో, శివసాయి రాజులస్వామినగర్‌లో రూ.45.5లక్షలతో, జైభీంనగర్‌లో రూ.15లక్షలు, జీవన్‌జ్యోతినగర్‌లో రూ.54.5లక్షలు, జైసంతోష్‌నగర్, దయానంద్‌నగర్‌లో రూ.45లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులతో పాటు లిటిల్‌స్టార్ స్కూల్ వద్ద రూ.28లక్షలతో, రాంరెడ్డి నగర్‌లో రూ.87లక్షలతో, ఎస్‌ఆర్ నాయక్ నగర్‌లో రూ.31లక్షలతో, భవానీనగర్‌లో రూ.35లక్షలతో, సూరారం కాలనీలో రూ.34లక్షలతో, సుందర్‌నగర్‌లో రూ.18.5 లక్షలతో, జైసంతోష్‌నగర్‌లో రూ.34లక్షలతో, రూ.16లక్షల వ్యయంతో నర్సింహాబస్తీలో నిర్మించనున్న భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



దుండిగల్ విలేజ్‌లోని మున్నూరు కాపు సంఘం వినాయకుడి లడ్డూను రూ.3.02లక్షలకు దక్కించుకున్న ఆకుల భరత్ పటేల్



దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని శ్రీసాయిబాలాజీ ఎన్‌క్లేవ్ వినాయకుడి లడ్డూను రూ.1.80లక్షలకు దక్కించుకున్న శ్రీనివాసులు రెడ్డి

## గణేశుడి లడ్డూల వేలం..

దుండిగల్,అక్టోబర్1: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లోని వినాయక మండపాల వద్ద గణేశుడి లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని శ్రీసాయిబాలాజీ ఎన్‌క్లేవ్ వినాయకుడి లడ్డూను స్థానికులు డాకా శ్రీనివాసులు రెడ్డి రూ.1లక్ష 80వేలకు దక్కించుకోగా, దుండిగల్ విలేజ్‌లో స్థానిక మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రూ.3లక్షల 2 వేలు పలికింది. సంఘం నేత ఆకుల భరత్‌పటేల్ వేలంలో పాల్గొని లడ్డూను కైవసం చేసుకున్నారు.




